సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా జల్లులు పడవచ్చు. రాత్రికి కూడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం చేశారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం గావించారు. ఆ తర్వాత గణపతి హోమం, కుంకుమ పూజ చేశాక పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.


3 నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 3 నుంచి జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. బాబూ క్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్, చుంచుపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు. కాగా, ఇంటర్ ప్రాక్టికల్స్ అక్టోబర్ 16 నుంచి 23 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వివరాలకు పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు(8919279238)ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నీ

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీ క్రీడా మైదానంలో ఈనెల 22 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, నవభారత్, కేటీపీఎస్ పరిసర ప్రాంతాల క్రీడాకారులు వస్తారని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పోటీలు ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజ్ హాజరవుతారని వివరించారు.

కేజీబీవీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో సీట్లను భర్తీ చేయడానికి మెరిట్‌లో 1:3 నిష్పత్తిలో అర్హత గల విద్యార్థుల సర్టిఫికెట్లను డీఈఓ వెంకటేశ్వరాచారి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీజీఈ మాధవరావు, ఎఫ్ఏఓ శ్రీనివాస్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులు, నాగ రాజశేఖర్, అన్నమణి, ప్రధానోపాధ్యాయులు పద్మలత పాల్గొన్నారు.

సింగరేణికి సవాల్!





సింగరేణి మెడికల్ బోర్డులో అవినీతిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే రూ. 10,000 నజరానా అందించడంతో పాటు ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఎండీ ఎన్.బలరాం ప్రకటించిన మరుసటి రోజే కొత్తగూడేనికి చెందిన ఓ మహిళ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. మెడికల్ బోర్డుతో పాటు కంపెనీ క్వార్టర్ల దుర్వినియోగం, సంస్థ స్థలాల కబ్జాలకు సంబంధించిన అంశాలను అందులో ప్రస్తావించింది. సింగరేణిలో హైడ్రా తరహా విధానం అమలు చేస్తామని సీఎండీ ప్రకటన చేసిన నేపథ్యంలో రాత పూర్వక ఫిర్యాదు అందడంతో 'సింగరేణి' ఎదుట సరికొత్త సవాల్ నిలిచినట్టయ్యింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

విజిలెన్స్ విఫలం !

40 వేల మందికి పైగా కార్మికులు/ఉద్యోగులు, నిత్యం కోట్ల రూపాయల వ్యాపారం, రూ.30 వేల కోట్ల విలువైన ఆస్తులు కలిగిన సింగరేణి విజయవంతంగా నడుస్తున్న ప్రభుత్వ రంగ కార్పొరేట్ సంస్థ. దీంతో నిర్వహణ సజావుగా సాగేందుకు అన్ని రకాల విభాగాలు పని చేస్తుంటాయి. అందులో సంస్థ పరిధిలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన పని విజిలెన్స్ విభాగానిది. ఈ విభాగంలో సంస్థ పరిధిలో 34 మంది ఉద్యోగులు/అధికారులు పని చేస్తున్నారు. ఇందులో 12 మంది ఏరియాల్లో, కార్పొరేట్‌లో 22 మంది ఉన్నారు. అయితే మెడికల్ బోర్డులో జరిగే అవినీతి అక్రమాల కారణంగా సంస్థ ప్రతిష్టకు భంగం కలుగుతోంది. ఈ అవినీతిని బట్టబయలు చేయడంలో విజిలెన్స్ విభాగం విఫలం కావడంతో.. సీఎండీ బలరాం నాయక్ ఈ ఏడాది ఆరంభంలో విచారణ బాధ్యతలను సీఐడీకి అప్పగించారు. అంతకు ముందు ఏసీబీకి సైతం ఈ పనిని అప్పగించారు.

'అన్‌ఫిట్' అక్రమాలపై లిఖితపూర్వక ఫిర్యాదు

- క్వార్టర్ల ఆక్రమణ, స్థలాల కబ్జాల వివరణలు కూడా..
- సీఎండీకి ఫిర్యాదు చేసిన మహిళ
- ఇప్పటికే విచారణ చేస్తున్న ఏసీబీ, సీఐడీ
- విజిలెన్స్ విభాగం వైఫల్యం వల్లే ఈ దుస్థితి !

ఫిర్యాదులో అంశాలు

సింగరేణి కార్మికుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఓ వ్యక్తి రామవరంలో అక్రమంగా కంపెనీ క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. మెడికల్ బోర్డులో కీలక వ్యక్తులు తనకు బంధువులు, పరిచయస్తులని చెబుతూ 'అన్‌ఫిట్' కోసం రూ.6 లక్షల వరకు వసూలు చేస్తున్నాడు. స్థానికంగానూ న్యూసెన్స్ చేస్తున్నాడు. ఇతని చర్యలతో సంస్థ ప్రతిష్ట మసకబారడంతో పాటు తాము అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ కొత్తగూడెం మండలం రామవరానికి చెందిన ఓ మహిళ ధైర్యంగా ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు కాపీలను సింగరేణి ఎస్అండ్ పీసీ విభాగం మొదలు డైరెక్టర్ పా, సీఎండీ వరకు అందరికీ ఈనెల 19న రాతపూర్వకంగా పంపింది. బహిరంగ విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలంటూ సింగరేణి అధికారులకు సవాల్ విసిరింది. ఫిర్యాదు కాపీలను అన్ని పత్రికలకు పోస్టులో పంపడంతో విషయం వెలుగు చూసింది.

ఎక్కువ బదనాం ఇక్కడే..

కారుణ్య నియామకాలకు సంబంధించి బ్యాక్‌డోర్‌లో డబ్బులు కట్టకపోతే ఉద్యోగాలు రావనే పరిస్థితిని దళారులు సృష్టించారు. ఈ భయానక పరిస్థితి విజయవంతంగా కొనసాగడానికి వారికి లోపాయకారిగా సహకరించే కొందరు సింగరేణి ఉద్యోగులు/అధికారులే ప్రధాన కారణం. ఈ భయాన్ని ఆధారంగా చేసుకుని ఒక్కో కార్మికుడి నుంచి రూ.ఐదు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. 20, 30 ఏళ్ల కార్మికుడిగా రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి పొదుపు చేసుకున్న సొమ్ము దళారులు, వారికి సహకారం అందించే కొందరు ఉద్యోగుల చేతుల్లోకి వెళ్తోంది. తమ బిడ్డల భవిష్యత్తు కోసమంటూ నేరుగా ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. కానీ ఇక్కడ జరిగే అవినీతి బహిరంగ రహస్యమే. రాత పూర్వక ఫిర్యాదు చేయకపోయినా డబ్బులు చెల్లించిన వారు అందరికీ ఆ విషయాన్ని చెబుతూనే ఉన్నారు. విజిలెన్స్ వైఫల్యం వల్ల సంస్థకు చెడు పేరు రావడంతో పాటు మెడికల్ బోర్డుకు సంబంధం ఉండే ఇతరులూ ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఫిర్యాదులు ఇలా..

సింగరేణికి నష్టం కలిగించే పనులు చేస్తున్న ఉద్యోగులు, ఇతరుల సమాచారాన్ని 9491144104 నంబర్ లేదా vig@scclmines. com ద్వారా కూడా అందించే అవకాశం ఉంది.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు 15 పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు వీరే..

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు 15 పతకాలు వచ్చాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. మహీధర్ తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో అండర్–14, 16, 20 పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి 30 మంది పాల్గొని 15 పతకాలు సాధించారు. భద్రాచలానికి చెందిన ఎస్‌కే అఫ్రీన్, జావెలిన్‌త్రోలో బంగారు పతకం, సీహెచ్ వేదాశ్రీ కిడ్స్ జావెలిన్, ట్రయాతలాన్‌లో రెండు బంగారు పతకాలు, ఎం.శ్రీవిద్యాదొర 80 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం, కొత్తగూడేనికి చెందిన జుర్రుపల దీక్షిత్ షాట్‌పుట్‌లో బంగారు, ఎం.పవన్ హైజంప్‌లో బంగారు పతకం, ఎ.వందన డిస్కస్‌త్రోలో బంగారు పతకం, ఎం.సంగీత మూడు కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో బంగారు పతకం, పి.కరుణ హైజంప్‌లో బంగారు పతకం, పాల్వంచకు చెందిన ఎం.టబు 800 మీటర్ల పరుగు పందెంలో రజిత, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించారని మహీధర్ వివరించారు. ఇంకా పి.ఉషారాణి 5 కిలోమీటర్ల పరుగుపందెంలో రజిత, కొత్తగూడేనికి చెందిన ఎం.సింధు 400 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం, ఎం. ఇందు 3000 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, భద్రాచలానికి చెందిన టి.శ్రీతేజ 100 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను జిల్లా క్రీడల శాఖ అధికారి ఎం.పరందామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి, జిల్లా అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సీతామహాలక్ష్మి ధర్నాలో పాల్గొని మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ధర్నా వద్దకు జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజేత వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కె.జమలయ్య, ఎన్.ప్రసాద్, వి.మల్లికార్జున్, జి.మణి, బి.లలిత, పి.శ్రీలత, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఈ నెల 23 నుంచి 28 వరకు కొబ్బరి చెట్లు ఎక్కడంలాంటి మెళకువల శిక్షణకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంతో నిర్వహించే ఈ శిక్షణకు ఆసక్తి గల 50 ఏళ్ల లోపు స్త్రీ, పురుషులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, నామినీ ఆధార్ కార్డుతో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 96425 33324 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఏచూరి జీవితం విద్యార్థులకు ఆదర్శం

ఖమ్మంమయూరిసెంటర్ : సీతారాం ఏచూరి ఇచ్చిన అధ్యయనం–పోరాటం నినాదం ఈ నాటి విద్యార్థి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిందని, చదువుతూ పోరాడు – చదువుకై పోరాడు నినాదం ఆయన ఇచ్చిందేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. సీతారాం ఏచూరి జీవితం ఈ తరానికి ఆదర్శమని అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ విద్యార్థి సమ్మెలపై ఏచూరి చేసిన దిశా నిర్దేశం విద్యార్థి సంఘాలకు మార్గ దర్శకంగా నిలిచిందన్నారు. అత్యంత ప్రతిభావంతుడైన ఏచూరి ఎర్రజెండాయే తన మార్గమని నమ్మారని అన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గనుల్లో పండగే..

సింగరేణి కార్మికులకు 33 శాతం మేర లాభాల వాటా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.2,888.20 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇందులో 33 శాతం అంటే రూ.788 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికులకు మరో రూ.8 కోట్లు కలిపి మొత్తంగా రూ.796 కోట్లు లాభాల వాటా చెల్లిస్తామని ప్రకటించడంతో కార్మికుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, అక్టోబర్ 5, 6 తేదీల్లో కార్మికుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది.

–సింగరేణి (కొత్తగూడెం)

10లో

ప్రశాంతంగా ప్రవహించే మున్నేరు ఈనెల 1వ తేదీ తెల్లవారేకల్లా విధ్వంసం సృష్టించింది. మున్నేటి వరదలతో పరీవాహక ప్రాంతం అతలాకుతలమైంది. పలువురి ఇళ్లు కూలడం, ఇంకొందరి ఇళ్లలోకి వరద, బురద చేరింది. ఇళ్ల ముందు మోకాల్లోతు బురద మేటలు వేయడంతో వరద తగ్గాక చూసుకున్న బాధితులు భవిష్యత్‌పై ఆందోళన చెందారు. ఇంతలోనే ప్రభుత్వ అధికారులు రంగంలోకి దిగారు. వేగంగా సహాయక చర్యలు చేపడుతూనే బాధితులను ఆదుకోవడంపై దృష్టి సారించారు. వీరికి తోడు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యక్తిగత సేవకులు ఇలా అంతా ఏకం కావడంతో పది రోజుల్లో మున్నేరు పరీవాహక ప్రాంతం పూర్వ స్థితికి చేరింది. రాష్ట్ర మంత్రులు, కలెక్టర్ మొదలు అన్ని శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది.. ఇలా ప్రతీ ఒక్కరు సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు భరోసా కల్పించారు. శనివారం ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం (థ్యాంక్స్ గివింగ్ డే) సందర్భంగా వివిధ శాఖల సేవలపై ప్రత్యేక కథనం.

– ఖమ్మం మయూరిసెంటర్

మీ సేవలకు సలాం..

- ముంపు ప్రాంతాల్లో సైనికుల్లా పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులు
- వేగంగా విద్యుత్ పునరుద్ధరణ సేవలు
- రక్షణతో పాటు సంరక్షణలో పోలీసులు
- రోడ్లపై బురద తొలగింపులో ఫైర్
- ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించిన సిబ్బంది

నేడు ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం



సాహో సఫాయివాలా..

మున్నేరు వరద తగ్గిన మరుసటి రోజు నుంచే ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు సైనికుల్లా పని చేశారు. ఖమ్మం నగరం, రూరల్ మండలంలో రోడ్లపై చేరిన చెత్త తొలగించడంతో పాటు, గృహాల నుంచి వెలువడే వ్యర్థాలను సేకరించారు. కేఎంసీ, గ్రామపంచాయతీలు, ఇతర మున్సిపాలిటీల నుంచి 2 వేల మందికి పైగా కార్మికులు ముంపు ప్రాంతాల ప్రజల కృతజ్ఞతలు అందుకుంటున్నారు. పారిశుద్ధ్య పనుల్లో మేయర్, కేఎంసీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది పనితీరు అద్భుతమని బాధితులు కొనియాడుతున్నారు.

వారం పాటు కేఎంసీలోనే..

మున్నేరు ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం నుంచి నిత్యావసరాలు, ఇతర సామగ్రి అందజేశారు. నిత్యావసర సామగ్రికి తోడు దుప్పట్లు, ఇతర కిట్లను ప్యాకింగ్ చేయడంలో డీఆర్‌డీఏ సిబ్బంది పనితీరు అభినందనీయం. వారం పాటు డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది కేఎంసీలోనే మకాం వేసి ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా బాధితులకు సకాలంలో సాయం అందేలా కృషి చేశారు.



నిత్యావసర కిట్లు, తాగునీటి క్యాన్లు మోసుకొస్తున్న దాతలు (ఫైల్)



జలగంనగర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్ (ఫైల్)

'యూనిఫామ్' సేవలు భేష్

వరదల సమయాన పోలీస్, ఫైర్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలు అందరి మన్ననలు అందుకున్నాయి. 500 మంది పోలీసులు, 250 మంది ఫైర్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రజలకు రక్షణగా నిలిచే పోలీసు యంత్రాంగం వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఆహారం అందించడం మొదలు నష్టంపై సర్వే చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఫైర్ సిబ్బంది తమ ఫైర్ ఇంజన్లతో రోడ్లపై చేరిన బురదను తొలగిస్తూ జేజేలు అందుకున్నారు. అటవీశాఖ ఉద్యోగులు సైతం సహాయక చర్యల్లోనే కాక సాయం అందించడంలో తమదైన పాత్ర పోషించి భేష్ అనిపించుకున్నారు.

ప్రత్యేక బృందాలతో వైద్యం



జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ 896 బృందాలను ఏర్పాటు చేసింది. ఇక మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో 60 బృందాల ద్వారా ఇంటింటి జ్వర సర్వే చేపట్టారు. అంతే కాక వైద్య శిబిరాల ద్వారా సేవలందించారు. దీంతో తక్కువ సంఖ్యలో తప్పితే ఎక్కడా సీజనల్ జ్వరాలు కానీ ఇతర వ్యాధులు కానీ వ్యాప్తి చెందకపోవడంతో వైద్యులు, సిబ్బందికి అభినందనలు అందాయి.

అందరి సహకారంతోనే..



భారీ వరదతో కట్టుబట్టలతో బయటకు వెళ్లాం. మాకెవరు దిక్కు అని ఆందోళనలో ఉన్న సమయాన అధికారులు, దాతలు మాలో ధైర్యం నింపారు. మేం ఇప్పుడు సాధారణ జీవితం గడుపుతున్నామంటే ఉద్యోగులతో పాటు దాతల పాత్ర ఉంది. అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

– అలవాల గురవమ్మ, మంచికంటి నగర్, ఖమ్మం

నాలుగు రోజుల్లోనే వెలుగులు

వరదలతో విద్యుత్ స్తంభాలు విరగడమేకాక ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గృహాల్లో మీటర్లు తడిచి పాడవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యాన విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. 400 మంది సిబ్బంది అహర్నిశలు పని చేసి నాలుగు రోజుల్లోనే ప్రతీ ఇంట్లో వెలుగులు నింపారు.

మాకు వారే దిక్కయ్యారు..



సర్వం కోల్పోయిన మాకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులే దిక్కయ్యారు. అంతా తోచిన సాయం చేయడంతో పది రోజులు ఆకలి బాధ ఎదురుకాలేదు. ఆ తర్వాత కూడా సామగ్రి అందించారు. ఫ్యాన్లు, గ్యాస్ స్టౌలు ఉచితంగా బాగు చేయించారు. వీరందరికీ సలాం.

– బానోతు భద్రమ్మ, మోతీనగర్, ఖమ్మం

కార్మికుల సేవలు వెలకట్టలేనివి..



అన్నిచోట్లా మోకాలి లోతు బురద, వ్యర్థాలు చేరాయి. వీటిని చూసి ఎప్పుడు బాగుపడతామోనని అనుకున్నాం. కానీ కార్మికులు రాత్రింబవళ్లు పనిచేసి నాలుగు రోజుల్లోనే కొలిక్కి తీసుకొచ్చారు. దుర్వాసనలోనూ పనిచేసిన కార్మికులకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువే.

– బి.సాయిరాం, పెద్దమ్మతల్లి గుడి రోడ్, ఖమ్మం

క్లుప్తంగా

బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చర్ల: బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ నల్లూరి ఉదయభాస్కర్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కోసం అవగాహన సమావేశం నిర్వహించగా రంగాకిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ కేవలం బీజేపీ ఒక్కటేనన్నారు. అనంతరం సభ్యత్వ నమోదుపై జిల్లా కన్వీనర్ పానిశెట్టి వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుంజా దర్మారావు, త్రినాథరావు, బి.క్రాంతికుమార్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, ఎడవల్లి శేషగిరిరావు, నూపా రమేశ్, గుమ్మల వేణు, ఆలెం సమ్మయ్య, చుక్కా శివ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారానికి నిరసనగా నేడు బంద్

గుండాల: కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారానికి నిరసనగా శనివారం బంద్ పాటించాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ కొడెం వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బహిరంగ ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. నేటి బంద్‌కు జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు, విద్యాసంస్థల వారు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కూలీ డబ్బుల కోసం దాడి

ఇల్లెందు: కూలీ డబ్బులు అడగడంతో జరిగిన ఘర్షణలో ఇరువురు మహిళలు తనపై దాడి చేశారని ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదైంది. ఒడ్డుగూడెం పంచాయతీ నెహ్రూనగర్‌కు చెందిన భూక్యా సందీప్‌ను అదే గ్రామానికి చెందిన బానోతు విజయ, బిందు తీవ్రంగా కొట్టి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

స్తంభం పైనుంచి పడి ఏఎల్‌ఎంకు గాయాలు

ముదిగొండ: విద్యుదాఘాతంతో విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి ఏఎల్‌ఎంకు గాయాలైన ఘటన ముదిగొండ మండలం కమలాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. కమలాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు జంపర్ కలపడడం కోసం గంధసిరి ఏఎల్‌ఎం పున్నయ్య విద్యుత్ స్తంభం ఎక్కగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడి నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. ఏఎల్‌ఎంను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు..



డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

సత్తుపల్లి: వేగంగా వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని గాల్లోకి ఎగిరి పడిన ఘటన మండలంలోని గంగారం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గంగారం గ్రామానికి చెందిన బెజవాడ చెన్నకేశవ, దేవేంద్రసాయి, ఎం.వెంకటకృష్ణ, కాలసాని శ్రీనివాసరావులు గణేశ్ నిమజ్జనాన్ని పూర్తి చేసుకొని కారులో మేడిశెట్టివారిపాలెం నుంచి గంగారం వస్తుండగా సాయిస్ఫూర్తి కళాశాల ఎదుట కారు వేగంగా డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు గాలిలోకి ఎగిరి పక్కనే తుప్పల్లో పడిపోయింది. కారులో ఉన్న కాలసాని శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఖమ్మం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ

ములకలపల్లి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ములకలపల్లి వైపు నుంచి పాల్వంచకు వెళ్తున్న కారు, పాల్వంచ నుంచి ములకలపల్లికి వస్తున్న ద్విచక్ర వాహనం మాధారం అటవీ ప్రాంతంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో బైక్ మీదున్న ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా పాల్వంచ వెళ్తుండగా పోలీసులు దమ్మపేట క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన యువకుల వివరాలు తెలియాల్సి ఉంది.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని లంబాడాకాలనీలో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు జరుగుతున్న సమయంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మితో పాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన పలువురు వ్యక్తులపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసునమోదైంది. ఈ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు అయ్యినట్లు టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు.

గోదా'వర్రీ'..



గోదావరి వరదలకు నీటమునిగిన పంటలు (ఫైల్)

- వరదల నుంచి శాశ్వత పరిష్కారమేదీ
- వరదలప్పుడే కరకట్టల ప్రస్తావన
- వరుస నష్టాలతో కుదేలవుతున్న రైతులు

బూర్గంపాడు: ఏటా వస్తున్న గోదావరి వరదలు రైతులకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నాయి. గోదావరి వరదలతో భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని వేలాది ఎకరాల పంటలు నీటమునుగుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఏటా వరదలు రావటం పంటలు నష్టపోవటం పరిపాటిగా మారింది. ఈ ప్రాంతాల్లోని రైతులు వానాకాలం పంటలను పూర్తిగా వదిలేసుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. వరదలకు పంటలు నష్టపోయినా ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందని పరిస్థితులున్నాయి. వరదల సమయంలో కరకట్టల నిర్మాణాలు చేపడతామని హడావుడి చేసే ప్రజాప్రతినిధులు ఆ తరువాత ప్రస్తావన కూడా తీసుకురావటం లేదు. 1986లో వచ్చిన గోదావరి వరదలనే ప్రామాణికంగా తీసుకుని అధికార యంత్రాంగం ప్రస్తుత ముంపును ప్రభుత్వానికి నివేదిస్తోంది. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గోదావరి వరదల నుంచి భద్రాచలాన్ని కాపాడేందుకు పట్టణం చుట్టూ కరకట్టలు నిర్మించారు. దీంతో వరద ప్రభావం ఎక్కువగా బూర్గంపాడు మండలం వైపు పడింది. 1986లో వచ్చిన 75.6 అడుగుల గోదావరి వరదకు ఏ మేరకు భూములు, ఇళ్లు ముంపునకు గురయ్యాయో, 2022లో వచ్చిన 73.5 అడుగుల గోదావరి వరదకు అదే స్థాయిలో ఇళ్లు, భూములు ముంపునకు గురయ్యాయి. భద్రాచలం వైపు కరకట్టల నిర్మాణం, గోదావరిలో ఇసుక పూడికలతో వరద ప్రభావం గతంలో కంటే ఎక్కువగా ఉంటోంది. అధికార యంత్రాంగం 1986 వరదలను ప్రామాణికంగా తీసుకుని ముంపు అంచనా వేస్తున్నారు. అయితే గోదావరి పరీవాహక భూములు మొదటి ప్రమాద హెచ్చరిక (43 అడుగులు) నుంచే ముంపునకు గురవుతున్నాయి. రెండో ప్రమాద హెచ్చరిక (48 అడుగులు) వద్ద తీవ్రత కొంతమేర పెరుగుతోంది. మూడో ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) చేరే సరికి భూముల ముంపు వందలాది ఎకరాలకు చేరుతోంది. అయితే అధికారులు మాత్రం మూడో ప్రమాద హెచ్చరిక దాటేంత వరకు భూముల ముంపు పెద్దగా ఉండదని ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఈ ఏడాది మూడుసార్లు గోదావరి వరద 50 అడుగులకు చేరుకుంది. దీంతో బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం మండలాల్లోని గోదావరి పరీవాహక భూముల్లో పంటలు నీటమునిగాయి. వరదలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి పరిహారం అందటం లేదు. వానాకాలం సీజన్ జూన్‌లో మొదలవుతుంది. అయితే గోదావరి పరీవాహక ప్రాంతాల రైతులకు మాత్రం వ్యవసాయ సీజన్ ఎప్పుడు ఆరంభించాలో తెలియని దుస్థితి. జూన్‌లో పంటలు వేస్తే జూలై వరదలు పంటలను ముంచుతున్నాయి. మళ్లీ జూలైలో పంట వేస్తే ఆగస్టు వరదలు ముంచుతున్నాయి. మూడోసారి ఆగస్టులో పంటలు వేస్తే సెప్టెంబర్‌లో వచ్చే వరదలు పంటలను దెబ్బతీస్తున్నాయి. సెప్టెంబర్ నెలాఖరుకు వర్షాలు వెనుకబడతాయి. దీంతో పంటల సాగు ప్రశ్నార్థకమవుతోంది. ఏటా ఇలాంటి పరిస్థితులే ఎదురవుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అసలు పంటలు వేయాలా? మానుకోవాలా? అనే డైలమాలో రైతులున్నారు. గోదావరి వరదల సమయంలో పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందాలు, రాష్ట్ర బృందాలు నష్ట నివేదికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించినా ఎప్పుడు కూడా రూపాయి పరిహారం రాలేదు. 2006లో వచ్చిన గోదావరి వరదలకు పంటనష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.2 వేల చొప్పున నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నిసార్లు గోదావరి వరదలు వచ్చినా ఏ ప్రభుత్వం కూడా రూపాయి సాయమందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి వరదల సమయంలో కరకట్టల నిర్మాణాలను ప్రస్తావించే మంత్రులు, ముఖ్యమంత్రులు వరదలు తగ్గిన తరువాత ఆ ఊసే మరిచిపోతున్నారు. ఇప్పటి వరకు ఎగువ నుంచే వచ్చే గోదావరి వరదలతో పాటుగా దిగువన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో బ్యాక్‌వాటర్‌తో కూడా భద్రాచలం రెవెన్యూ డివిజన్‌కు ముంపు తీవ్రత మరింతగా పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గోదావరి వరదల నుంచి శాశ్వత పరిష్కారం కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూడుసార్లు పత్తి వేశాను



జూలై వరదల తరువాత ఆరెకరాల్లో పత్తి గింజలు వేశాను. ఆగస్టులో వచ్చిన వరద పత్తిని ముంచింది. మొక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆగస్టులో మళ్లీ గింజలు వేశాను. సెప్టెంబర్ 10వ తేదీ వచ్చిన వరదలు మళ్లీ పంటను దెబ్బతీశాయి. వరద తగ్గిన తరువాత పత్తిగింజలు మూడోసారి వేశాను. వర్షాలు లేకపోవటంతో గింజలు సరిగా మొలవలేదు.

– చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

ఏటా పంటలకు నష్టం



ఏటా వస్తున్న గోదావరి వరదలతో పంటలు నష్టపోతున్నాం. పంట వేయటం గోదారి రావటం పరిపాటిగా మారింది. ఏటా మూడు, నాలుగు సార్లు వరదలకు పంటలు నష్టపోతున్నాం. పంటలు వేయటం కంటే మానుకోవటమే మేలనిపిస్తుంది.

– యదమకంటి నర్సింహారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

ఇసుక సీజ్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న ఆర్‌ఐ రవి

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలో రెండు చోట్ల నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. కుంటినాగులగూడెం, పేటచెరువు ప్రాంతాల్లో ఇసుకను మొర్రేడు వాగు నుంచి తెచ్చి నిల్వ చేసి లారీల్లో తరలిస్తున్నట్లు స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో తహసీల్దార్ వివేక్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ రవి నిల్వ చేసిన ప్రదేశాలను సందర్శించి, ఇసుకను లారీల్లో లోడ్ చేయించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం, ములకపాడు, నడికుడి గ్రామాల్లో శుక్రవారం జిల్లా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 63 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. అశ్వారావుపేట నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు వైపు వేగంగా దూసుకెళ్తున్న కారు మండలంలోని ఆసుపాక గ్రామం వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా, స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాదంలో కారు ధ్వంసమైంది.

టాటా ఏస్ డ్రైవర్‌పై కేసు



షాపులపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

పాల్వంచరూరల్: నిద్రమత్తులో వాహనాన్ని నడపడంతో అది విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. టేకులపల్లి మండలం కొండెంగల బోడు గ్రామానికి చెందిన టాటా ఏస్ వాహనం డ్రైవర్ భూక్యా కిషన్ శుక్రవారం తెల్లవారు జామున పాల్వంచ వైపు వస్తుండగా పెద్దమ్మగుడివద్ద విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్‌స్తంభం విరిగి పక్కన మరో రెండు దుకాణాలపై పడటంతో సుమారు రూ.50వేల ఆస్తి నష్టంవాటిల్లిందని విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.సురేశ్ తెలిపారు.

జనావాసాల మధ్య పిడుగు

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున ఉన్న సీపీఐ కార్యాలయం ఎదుట ఓ చెట్టుపై పిడుగుపడింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం.. పిడుగుల మోతతో దద్దరిల్లింది. నిత్యం జనం సంచరించే సీపీఐ కార్యాలయం వద్ద పిడుగు పడటం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బాలికపై బాలుడు లైంగికదాడి?

ఇల్లెందు: పట్టణంలోని ఓ వార్డులో బాలికపై బాలుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వినాయకుడి ఊరేగింపులో ఘర్షణ

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండి రేవు గ్రామంలో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు జరుగుతున్న సమయంలో అశ్వాపురం మండలానికి చెందిన కంచుగట్ల మహేశ్‌తో పలువురు వాగ్వాదానికి దిగారు. అతడిపై కర్రతో దాడి చేయగా తలకు గాయమైంది. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అకారణంగా తనపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడి, గాయపరిచారని మహేశ్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఆరుగురు మహిళలకు జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: బంగారం షాపునకు కొనేందుకు వచ్చినట్లు నటించి బంగారం చోరీ చేసిన ఆరుగురు మహిళలకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.500 జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.సుచరిత శుక్రవారం తీర్పు చెప్పారు. జూలురుపాడు మండలం వెంకన్నపాలెంనకు చెందిన జాజిరియా సునీత వెంకన్నపాలెం క్రాస్‌రోడ్డు వద్ద బంగారం షాపు నిర్వహిస్తోంది. 13-10-2017న షాపులోకి గుర్తుతెలియని ఆరుగురు మహిళలు వచ్చి నగలు చూసి కొనకుండా వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన షాపు జాజిరియా సునీత సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి వెండి పట్టీలు రూ.7వేలు విలువైనవి పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు వరంగల్‌జిల్లా నర్సింహులపేట మండలం పకీరతండా, బొడ్డు తండాలకు చెందిన గుగులోతు కోభి, భూక్య మంక్తి, భూక్య అంకు, భూక్య సీత, ఆంగోతు రాజీ, లకావత్ కాళీ చోరీ చేశారని గుర్తించి అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన జడ్జి పైవిధంగా తీర్పుచెప్పారు.

23న మంత్రి పొంగులేటి పర్యటన

ఇల్లెందు: ఈ నెల 23న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందులో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. తొలుత మండలంలోని మామిడిగుండాల, ముకుందాపురంలో రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల పార్క్‌లో రూ.కోటితో స్విమ్మింగ్‌పూల్, రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన చేస్తారు. మోడల్ మార్కెట్‌లో డ్రైన్, రోడ్లు, రూ.50 లక్షలతో మరుగుదొడ్లకు శంకుస్థాపన చేస్తారు. రూ. 13.6 కోట్లతో బుగ్గవాగు ప్రక్షాళన పనులకు శంకుస్థాపన చేస్తారు. రూ.1.30 కోట్లతో ఆర్ అండ్ ఆర్ కాలనీలో చిల్డ్రన్‌పార్క్ ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్మన్ డీవీ 'సాక్షి'కి తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వైరా: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరామ్మకాలనీలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ దేశంలోనే అతి పెద్ద పార్టీగా విస్తరించిందన్నారు. కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, కోటేశ్వరరావు, భద్రయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

కల్లూరురూరల్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులకు గురవుతుంటే సహకారం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. స్వగ్రామం నారాయణపురంలో శుక్రవారం రాత్రి పోలింగ్ బూత్ నంబర్ 94, 95లలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే 18 కోట్ల మంది బీజేపీ సభ్యత్వం పొందారని, మరో 10 కోట్ల మందిని చేర్చాలనే లక్ష్యంతో పార్టీ పని చేస్తుందని తెలిపారు.

కోతులు రాకుండా పెట్టిన విద్యుత్ తీగలు తగిలి..

కరెంట్ షాక్‌తో మరో రైతు మృతి



రైతు హతీరాం (ఫైల్)

కారేపల్లి: కోతుల బెడద నుంచి పత్తిపంటను కాపాడుకునేందుకు ఓ రైతు అమర్చిన విద్యుత్ తీగలు.. మరో రైతు పాలిట యమపాశాలుగా మారాయి. కోతులను తరిమేందుకు వెళ్లిన..ఆ రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం కొత్తూరు తండాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తూరుతండా గ్రామానికి చెందిన ధరావత్ హతీరాం (42) సాగు చేస్తున్న పత్తి పంటలో కోతులు పడి పత్తి కాయలు తింటుండడంతో వాటిని తరిమేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పక్క చేను రైతు అమర్చిన విద్యుత్ తీగలను గమనించని హతీరాం వాటికి తగిలి మృతి చెందాడు. అయితే, వర్షం వచ్చి తగ్గిన తర్వాత కూడా ఎంతకూ భర్త ఇంటికి రాకపోవడంతో అతడి భార్య నాగమణి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి చూడగా.. పత్తి చేనులో హతీరాం విగతజీవిగా పడి ఉన్నాడు. భర్త మృతదేహంపై పడి నాగమణి రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్‌ఐ ఎన్ రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.



పత్తి చేనులో మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో అధికారులు

భద్రాచలం: ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్, స్థానిక ఎక్సైజ్ అధికారుల దాడుల్లో శుక్రవారం భద్రాచలంలో 45.170 కేజీల ఎండు గంజాయి లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టి.. ఓ వాహనంలో తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి రాజస్థాన్‌కు ముకేశ్‌మిర్ధ, గుజ్జర్ శ్రీరామ గంజాయిని రవాణా చేస్తున్నట్లు తేలిందని, కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. కారు, రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ బాలు, సిబ్బంది సుధీర్, హరీశ్, హనుమంతరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

చర్ల: మండలంలోని లింగాపురంలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కాకర్ల ముత్యాలరావుకు చెందిన ఇంట్లో మంటలు లేచి, ఒక్కసారిగా ఇంటి మొత్తానికి వ్యాపించాయి. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.లక్ష మేర ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.



దగ్ధమవుతున్న పూరిల్లు

మైనర్ దివ్యాంగురాలిపై లైంగికదాడి

దమ్మపేట: మైనర్ దివ్యాంగురాలిపై ఓ గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మైనర్ దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగింది. దీంతో బాలిక ఐదు నెలల గర్భవతి అయింది. కాగా, తనపై లైంగికదాడి చేసినవారిని గుర్తించలేని పరిస్థితి బాధితురాలిది. ఆమె శరీరంలోని మార్పులు, ఆరోగ్యం క్షీణించడాన్ని గమనించి కుటుంబీకులు వైద్య పరీక్షలు చేయించగా గర్భవతి అనే విషయం తేలింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బాధితురాలి నుంచి నమూనాలను సేకరించి డీఎన్‌ఏ పరీక్షకు పంపించామని, నివేదిక వచ్చిన తరువాత కారకులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

గుండాల: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలంలోని చంద్రాపురం గ్రామానికి చెందిన చందా సమ్మయ్య (50) కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగులమందు తాగాడు. సమ్మయ్య కొడుకు దుక్కిటెద్దును కొనుక్కోవాలని తండ్రిని డబ్బులు అడిగాడు. దీంతో ఆయన నిరాకరించారు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన సమ్మయ్య పురుగులమందు తాగగా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జోలెకట్టి.. మృతదేహాన్ని వాగు దాటించి..

కాగా, చంద్రాపురం గ్రామం వద్ద జల్లేరు వాగుపై వంతెన లేకపోవడంతో సమ్మయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులు జోలెకట్టి వాగు దాటించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రతీశ్ తెలిపారు.



మృతదేహాన్ని జోలె కట్టి వాగు దాటిస్తున్న దృశ్యం

వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బాణాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాణాపురం గ్రామానికి చెందిన మాదాసు నరేశ్ (35) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మనస్తాపంతో మహిళ...

కూసుమంచి: మండలంలోని దుబ్బతండాకు చెందిన బోడ శాంతమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. శాంతమ్మ తండాలో కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. తండాకు చెందిన జర్పుల శివను సరుకుల బాపతు బాకీ డబ్బులు అడిగింది. దీంతో శివ కుటుంబ సభ్యులతో సహా వచ్చి శాంతమ్మపై దాడికి దిగారు. వారు తన తల్లిపై భౌతికంగా దాడికి పాల్పడటంతోనే మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



అశోక్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన బాణోతు రాములు – జానకీ దంపతులకు ఇద్దరు కుమారులు. రాములు ఇటీవలె మృతి చెందాడు. రెండో కుమారుడు బానోత్ అశోక్ (22) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం తన బైక్‌పై బొమ్మనపల్లికి వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కొత్తగూడెం ఏరియాస్పత్రికి, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాముకాటుతో వృద్ధురాలు...

కూసుమంచి: పొలంలో కలుపు తీసేందుకు వెళ్లిన వృద్ధురాలు.. పాముకాటుతో మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని హట్యాతండాకు చెందిన బాదావత్ తులిశమ్మ (68) గట్టుసింగారం శివారులో చిన్నకుమారుడు వీరన్న వద్ద ఉంటోంది. తులిశమ్మ శుక్రవారం ఉదయం వరిలో కలుపు తీసేందుకు వెళ్లగా ఆమెను పాము కాటు వేసింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఆమెను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి కుమారుడు కిషన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

నేలకొండపల్లి: పురుగులమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలానికి చెందిన పి.గోపి (28) మూడు రోజుల కిందట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి నెల కిందట వివాహమైంది. ఆరు నెలల కిందట ఓ కేసులో జైలుకు వెళ్లివచ్చిన గోపి అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

టీచర్ల సర్దుబాటుకు అనుమతి

విద్యాశాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని అన్ని జిల్లా కలెక్టర్లు, డీఈవోలకు పాఠశాలవిద్య డైరెక్టరేట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే క్రమంలో ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే రెండు స్కూళ్లను విలీనం చేసే అధికారాన్ని జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. పాఠశాల విద్య డైరెక్టర్ ఇ.నర్సింహారెడ్డి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. తాజా యూడైస్ డేటాను పరిగణనలోనికి తీసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని సూచించారు. చాలా స్కూళ్లలో విద్యార్థులున్నా, టీచర్లు ఉండటం లేదని, టీచర్లు ఎక్కువగా ఉన్నచోట విద్యార్థులు ఉండటం లేదని గుర్తించారు. టీచర్లు లేని స్కూళ్లలో విద్యార్థులు చేరినా, తిరిగి వారు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోతున్నారని చెప్పారు. దీన్ని నివారించేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే కాంప్లెక్స్‌లో రెండు స్కూళ్లు ఉంటే, వాటిని విలీనం చేసేందుకు విద్యాశాఖ అనుమతించింది. ఎంతమంది విద్యార్థులకు ఎంతమంది టీచర్లు ఉండాలో విద్యాశాఖ సూచించింది.

ప్రైమరీ... యూపీఎస్ స్కూళ్లలో

విద్యార్థులు	ఉండాల్సిన టీచర్లు
1-10	1
11-60	2
61-90	3
91-120	4
121-105	5
153-200	6
అప్పర్ ప్రైమరీ ఆ పైన	
1-20	సబ్జెక్టు టీచర్లు - 2 (1 లాంగ్వేజ్, 1 సబ్జెక్టు)
21 ఆపైన	సబ్జెక్టు టీచర్లు - 4

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ బదిలీ

కొత్త సూపరింటెండెంట్‌గా రామచంద్రం

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ బదిలీ అయ్యారు. చర్లపల్లి నూతన సూపరింటెండెంట్‌గా జి.రామచంద్రంను నియమిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంతోష్‌కుమార్ రాయ్‌ను సంగారెడ్డి సెంట్రల్ జైలు ఎస్పీగా బదిలీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న జి.రామచంద్రం ఎస్పీగా పదోన్నతి పొందారు. 15 రోజుల్లో సూపరింటెండెంట్ పోస్టులో చేరాలని ఆదేశించారు.

‘లడ్డూ’ వివాదంపై నివేదిక కోరిన కేంద్రం

సీఎం చంద్రబాబుతో మాట్లాడిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా

- అందుబాటులో ఉన్న నివేదికలను తమకు పంపాలని సూచన
- వివాదంపై సమగ్ర విచారణ జరపాలి: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్ర: కాంగ్రెస్ నేత పవన్ ఖేరా



సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కేంద్రం సమగ్ర నివేదిక కోరింది. లడ్డూ వివాదంపై అందుబాటులో ఉన్న నివేదికలను సత్వరమే తమకు నివేదించాలని చెప్పింది. వివాదం నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. ‘ఈ వివాదంపై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడాను. కొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నా. అందుబాటులో ఉన్న నివేదికను పరిశీలించడానికి వీలుగా కేంద్రానికి పంపాలని కోరాను. నేను రాష్ట్ర నియంత్రణ అధికారులతో కూడా మాట్లాడి దీనిపై దర్యాప్తు చేస్తాం. నివేదికను పరిశీలించి ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం చర్యలు తీసుకుంటాం’అని ఆయన ఢిల్లీలో తెలిపారు.

సమగ్ర దర్యాప్తు జరగాలి : ప్రహ్లాద్ జోషి

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా ఇది చాలా గంభీరమైన విషయం. దర్యాప్తు తర్వాత ఎవరైతే తప్పు చేశారో వారికి శిక్ష పడాలి.

బాధ్యులపై చర్యలు తప్పవు: జితేంద్ర సింగ్

తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో బాధ్యులపై చర్యలు తప్పవని తాను విశ్వసిస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు. ఇలాంటి ఘటన ఊహించలేదని అన్నారు. భక్తుల విశ్వాసాలను తిరిగి పెంపొందించే విధంగా సమగ్ర దర్యాప్తు జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్ర : పవన్ ఖేరా

ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంలో కుట్ర చేస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. సోషల్ మీడియాలో కొత్త కొత్త వాదనలు వినిపిస్తున్నాయని, దీనివల్ల ఎవరికి లాభమని ఆయన ప్రశించారు. తిరుపతి బాలజీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భక్తి విశ్వాసాలున్నాయని, వాటితో ఆడుకునే వారిని క్షమించరని అన్నారు. వెంటనే ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి

- లేదా విచారణ కోసం ఓ కమిటీని ఏర్పాటుచేయండి
- వాస్తవాల నిగ్గు తేల్చండి
- సీజే ధర్మాసనం ముందు వైవీ సుబ్బారెడ్డి తరఫున పొన్నవోలు ప్రస్తావన
- వచ్చే బుధవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం



సాక్షి, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి కల్తీపై వాస్తవాలను తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టును కోరారు. ఒకవేళ సిట్టింగ్ జడ్జితో విచారణ సాధ్యం కాకపోతే, విచారణ నిమిత్తం ఓ కమిటీని ఏర్పాటుచేయాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. తద్వారా వాస్తవాల నిగ్గుతేల్చాలని కోరారు. ఈ అభ్యర్థనతో తాము ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయనున్నామని, దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనాన్ని కోరారు. శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారని.. అందువల్ల నిజానిజాలు బయటకు రావాల్సి ఉందన్నారు. అందుకోసమే తాము ఈ వ్యాజ్యం దాఖలు చేస్తున్నామన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించినది కాబట్టి ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సుధాకర్‌రెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను తాము బుధవారమే విచారిస్తామని, ఈలోపు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

పవన్.. ఇదేం తీరు?

- దోషులను గుర్తించి చర్యలు తీసుకోండి
- అది మానేసి జాతీయ స్థాయిలో ఆందోళనలను వ్యాపింపజేస్తారా?
- సినీ నటుడు ప్రకాశ్ రాజ్ అసహనం

సాక్షి, అమరావతి : శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు రాజేసిన వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ‘ఎక్స్’ వేదికగా చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ‘మీరు డిప్యూటీ సీఎంగా ఉన్న రాష్ట్రంలో ఈ ఘటన జరిగింది. దానిపై విచారణ జరిపి.. దోషులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోండి. ఆ పని చేయడం మానేసి ఈ ఆందోళనను జాతీయ స్థాయిలో వ్యాపింపజేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఉన్న మత కల్లోలాలు చాలవా?’ అంటూ ప్రకాశ్ రాజ్ శుక్రవారం ‘ఎక్స్’లో పోస్టు చేశారు.

జరిగి ఉండదనే అనుకుంటున్నా..

చంద్రబాబు ఆరోపణలపై మాజీ ఐఏఎస్ ఐవైఆర్

సాక్షి, అమరావతి : ‘తిరుమల లడ్డు వ్యవహారంలో సీఎం చంద్రబాబు చేసిన కీలకమైన ఆరోపణను నేను నమ్మడంలేదు, అది జరిగి ఉండదనే అనుకుంటున్నా’.. అంటూ బీజేపీ నేత, మాజీ ఐఏఎస్ ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఆరోపణను రాష్ట్రంలో అత్యున్నత రాజకీయ స్థానంలో ఉన్న వ్యక్తి చేసినందున తప్పకుండా దీనిని పూర్తిస్థాయిలో విచారించి, పూర్వాపరాలను నిర్ధారించి సంబంధీకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ చంద్రబాబు ఆరోపణ నిజం కాకపోతే ఆయన ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఐవైఆర్ ఆ వీడియోలో చెప్పారు.

గుర్తు లేదు..మరిచిపోయిన!

జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట నీళ్లు నమిలిన ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్: ‘నాకు తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయిన..’కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వేసిన ప్రశ్నలకు కొందరు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చెప్పిన వింత సమాధానాలు ఇవి. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీ(టీఎస్ఈఆర్ఎల్) చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించిన శ్రీదేవిని కమిషన్ ఏ ప్రశ్న అడిగినా ‘తెలీదు..గుర్తు లేదు’అని సమాధానాలివ్వగా, కమిషన్ ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన మోడల్ స్టడీస్ విషయంలో కీలకపాత్ర పోషించిన ఆమెపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించగా, సమాధానాలు ఇవ్వలేక నీళ్లు నమిలారు. బరాజ్‌లను నిర్మించడానికి ముందే మోడల్ స్టడీస్ చేశామని తొలుత చెప్పిన ఆమె, ఆ వెంటనే మాట మార్చారు. దీంతో మీరు ఇచ్చిన అఫిడవిట్‌లోని సమాచారానికి సైతం కట్టుబడి ఉండకపోతే ఎలా? అని ఆమెపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం బీఆర్కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో పలువురు ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది.

- స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్డీఎస్ఓ) సీఈగా సైతం శ్రీదేవి వ్యవహరించగా, ఆ పోస్టులో ఉండి బరాజ్‌ల పరిరక్షణకు ఐఎస్ కోడ్‌ను అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, మౌనంగా ఉండిపోయారు.
- బరాజ్‌లకు వరదలు ఎప్పుడొచ్చాయన్న ప్రశ్నకు సైతం తెలియదు అని బదులిచ్చారు.
- బరాజ్‌లకు 2020లో త్రిడీ మోడల్ స్టడీస్ నిర్వహించినట్టు ఆమె చెప్పగా, 2023లో జరిగినట్టు టీఎస్ఈఆర్ఎల్ నివేదిక ఇచ్చిందని కమిషన్ ఆమెకు తెలియజేసింది. అయితే ఆ విషయం తనకు గుర్తు లేదని ఆమె బదులివ్వడంతో కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

బరాజ్‌లకు తనిఖీలు చేయలేదు

బరాజ్‌ల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారని ఎస్డీఎస్ఓ సీఈ ప్రమీళను కమిషన్ ప్రశించగా, ఆ బాధ్యత ప్రాజెక్టు అథారిటీదేనని ఆమె బదులిచ్చారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమల్లోకి వచ్చినా బరాజ్‌ల భద్రత వాటి చీఫ్ ఇంజనీర్‌దేనని స్పష్టం చేశారు. గేట్ల నిర్వహణలో మ్యానువల్స్, బరాజ్‌ల నిర్వహణ ప్రొటోకాల్స్ అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, ఆమె సమాధానమివ్వడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో పేర్లు చెప్పకుండా వివరాలు తెలపాలని కమిషన్ ఆమెను కోరింది. చట్టం ప్రకారం వర్షకాలానికి ముందు, తర్వాత తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వలేదని ఆమె వివరించారు.

– ఎస్డీఎస్ఓ ఈఈ విజయలక్ష్మి సైతం ఇదే విషయాన్ని కమిషన్‌కు తెలిపారు.

అధ్యయనాలు, నిర్వహణ లేకపోవడమే కారణం

బరాజ్‌ల వైఫల్యానికి కేవలం నిర్వహణ, పర్యవేక్షణ లోపాలే కాకుండా వాటికి ఎగువ, దిగువన రక్షణ చర్యలు తీసుకోకపోవడం కూడా కారణమేనని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఈఈ రఘునాథ శర్మ తెలిపారు. 2019 లోనే వరదల తర్వాత బరాజ్‌లలో లోపాలు బయటపడగా, 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగే వరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. వైఫల్యానికి కారకులు ఎవరు? నాటి ప్రభుత్వ అధినేతనా? అని కమిషన్ అడగ్గా, 3డీ మోడల్ అధ్యయనాలు జరపకపోవడం, నిర్వహణ ప్రొటోకాల్స్ పాటించకపోవడం కారణమని ఆయన బదులిచ్చారు.

- మోడల్ స్టడీస్ పూర్తికాక ముందే బరాజ్‌ల నిర్మాణం ప్రారంభించడంతోనే విఫలమయ్యాయని పలువురు టీఎస్ఈఆర్ఎల్ ల్యాబ్ ఇంజనీర్లు కమిషన్‌కు తెలిపారు. బరాజ్‌లను నీటి మళ్లింపుకోసం నిర్మిస్తారని, నిల్వ చేయడంతోనే కుంగిపోవడం, సీపేజీలు ఏర్పడడం జరిగిందన్నారు. వరదల సమయంలో కూడా గేట్లు మూసి ఉంచడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు.

కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీల సవరణ

- సబ్సిడీ పెంపుతో తగ్గనున్న డీఏపీ ధర
- 28-28, 24-24 తదితరాల సబ్సిడీ తగ్గింపు
- వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొత్త ధరలు అమలు

సాక్షి, హైదరాబాద్: పోషక కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీలను కేంద్రం సవరించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఏపీ సబ్సిడీని టన్నుకు రూ.21,675 నుంచి రూ.21,912కు పెంచింది. దీంతో దాని ధర కాస్త తగ్గుతుంది. 28-28 ఎరువుల సబ్సిడీ టన్నుకు రూ.538 తగ్గించింది. దీంతో దాని ధర పెరగడం వల్ల రైతులపై స్వల్పంగా భారం పడే అవకాశం ఉందని అంటున్నారు. 24-24 ఎరువుల సబ్సిడీని టన్నుకు రూ.461 తగ్గించడంతో దాని ధర కూడా కొంత పెరుగుతుంది. అలాగే 24-24-0-8 సబ్సిడీని రూ.461, 19-19-19 సబ్సిడీని రూ.365, 16-16-16 సబ్సిడీని రూ. 307 తగ్గించడంతో వీటి ధరలు కూడా మార్కెట్లో పెరుగుతాయి. సవరించిన, పెంచిన సబ్సిడీ మేరకు మారిన ధరలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అంటే యాసంగి సీజన్‌లో ఈ ధరలతోనే రైతులు ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి.

జిల్లా వార్తలు


మొక్కలు నాటిన సీఆర్‌పీఎఫ్ అధికారులు



మొక్కలు నాటుతున్న అధికారులు

చర్ల: మండలంలోని కలివేరులో గల సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరం మొక్కలు నాటుదాం కార్యక్రమంలో భాగంగా కలివేరులోని సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయంలో కమాండెంట్ రాజీవ్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ రంజన్ ప్రకాశ డాక్టర్ నీరజ్‌పాండే, సుబేదార్ మేజర్ అభిషేక్ చౌదరి తదితరులు మొక్కలు నాటారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో ఉన్న తిప్పాపురం, తోగ్గూడెం, చెలిమెల, చింతవాగు, ధర్మారం, సీఆర్‌పీఎఫ్ క్యాంపుల్లోనూ అక్కడి అధికారులు మొక్కలు నాటారు.

వాగు దాటి.. వైద్య శిబిరం



వాగు దాటుతున్న వైద్యాధికారి మధు, సిబ్బంది

కరకగూడెం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ అధికారులు ముమ్మరంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో కొమ్ముగూడెంలో సిబ్బందితో వాగు దాటి వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులను పరీక్షించారు. పలువురి రక్త నమూనాలు సేకరించి జ్వర పీడితులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ పోలెబోయిన క్రిష్ణయ్య, ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, క్రిష్ణ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్‌లో 157 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన మెడికల్ బోర్డ్‌లో 157మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయ్యారు. సింగరేణి వ్యాప్తంగా 11ఏరియాల నుంచి 194మందిని మెడికల్ బోర్డ్‌కు పిలవగా, వారిలో 166మంది హాజరయ్యారు. ఇందులో 157మంది 80 శాతం ఇన్‌వాలిడేషన్ కాగా, మిగిలిన వారిలో ఏడుగురిని హయ్యర్ రిఫరల్‌కు పంపించారు. ఇద్దరిని ఫిట్‌ఫర్ సేమ్ జాబ్‌కు బోర్డ్ అధికారులు రిఫరల్ చేసినట్లు తెలిసింది.

తెల్ల బంగారం ఊరిస్తోంది..

- సీడ్ రేటు పెరగడంతో ధర పైపైకి..
- రూ.8 వేలకు చేరిన క్వింటా పత్తి
- కొత్త పత్తికి సైతం మంచి డిమాండ్
- అక్టోబర్ నుంచి ఊపందుకోనున్న విక్రయాలు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన కొత్త పత్తి

తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తి ధరలు పైపైకి వెళ్తున్నాయి. సెప్టెంబర్ ఆరంభం నుంచి పత్తి ధరల ముందడుగు మొదలైంది. ఆగస్టు నెలాఖరు వరకు వరకు క్వింటా రూ.7,500గా ఉన్న ధర సెప్టెంబర్ ఆరంభం నుంచి పుంజుకుంది. గత ఏడాది నిల్వ చేసిన రైతులు తీసుకొస్తున్న పత్తికి ప్రస్తుతం రూ.8వేలు పలుకుతోంది. అలాగే, ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్త పత్తికి కూడా ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధర కన్నా అధికంగా నమోదవుతుండడం విశేషం. అక్టోబర్ నెలారంభం నుంచి కొత్త పత్తి విక్రయాలు ఊపందుకుని దసరా నాటికి మరింత జోరు పెరిగే అవకాశముంది. – ఖమ్మంవ్యవసాయం

గింజలకు పెరిగిన ధర

కొంత కాలంగా పత్తి సీడ్(గింజలు) ధర పెరుగుతోంది. క్వింటా పత్తి గింజల ధర రూ.3,200 నుంచి రూ.4,200కు చేరింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పలు వస్తువులపై దిగుమతి సుంకాన్ని పెంచడంతో నూనెల ధర.. ఫలితంగా పత్తి విత్తన ధరలు పెరిగాయి. ఇది పత్తి ధర పురోగతికి ఉపకరిస్తోందని చెబుతున్నారు. అంతేకాక బేల్ ధర రూ.65 వేల నుంచి రూ. 70వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.78,500కు చేరడం పత్తి ధర పెరగడానికి మరో కారణంగా తెలుస్తోంది.

గత రెండు సీజన్లలో నిరాశ..

గడిచిన రెండు సీజన్లలో పత్తి ధర రైతులను వేదనకు గురిచేసింది. సీజన్‌లో క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6వేలు మించలేదు. గత ఏడాది మరింత పతనం కావడంతో ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా తేమ, నాణ్యత ఆధారంగా రూ.7,020 చొప్పున కొనుగోలు చేసింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి గరిష్టంగా రూ.7,521గా నిర్ణయించింది. కానీ రెండు రోజులుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పాత పత్తికి గరిష్టంగా రూ.8వేలు, కొత్త పత్తి ధర రూ.7,722గా పలుకుతోంది. మద్దతు ధరతో పోలిస్తే ప్రైవేట్ వ్యాపారులు రూ.200 నుంచి రూ.500 వరకు అధికంగానే చెల్లిస్తున్నారు.

గడిచిన సీజన్ నుంచి పత్తి ధరలు (క్వింటాకు రూ.లలో)

నెల / తేదీ	గరిష్ట ధర	మోడల్ ధర
అక్టోబర్ 25	6,700	6,500
నవంబర్ 16	6,800	6,750
డిసెంబర్ 13	6,650	6,600
జనవరి 19	6,700	6,000
ఫిబ్రవరి 12	6,575	6,500
మార్చి 26	7,375	7,350
ఏప్రిల్ 16	7,350	7,300
మే 10	7,125	7,100
జూన్ 19	6,975	6,950
జూలై 10	7,275	7,000
ఆగస్టు 20	7,300	7,150
సెప్టెంబర్ 9	7,800	7,800
సెప్టెంబర్ 18	8,000	7,300

దిగుబడులపై వర్షాల ప్రభావం

ఈ ఏడాది పత్తి దిగుబడులను వానలు దెబ్బతీశాయి. ఆగస్టు 31 నుంచి ఈనెల మొదటి వారం వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలు పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ ఏడాది జిల్లాలో వ్యవసాయ శాఖ పత్తి సాగు లక్ష్యం 2,01,834 ఎకరాలు కాగా, ధర ఇతర కారణాలతో 1,88,184 ఎకరాల్లోనే రైతులు సాగు చేస్తున్నారు. ఇంతలోనే వర్షాలతో దాదాపు 15 వేల ఎకరాలు పూర్తిగా వరద పాలైంది. వర్షపు నీరు పంట చేలలో నిలవడంతో ఎర్రబారి పైర్లు తెగుళ్ల బారిన పడ్డాయి. పూత, కాత దశలో వానలు పత్తి దిగుబడిపై ప్రభావం చూపగా ఎకరాకు పది క్వింటాళ్లకు బదులు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్లు దాటే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

వచ్చే నెల నుంచి సీజన్

పత్తి పంట సీజన్ అక్టోబర్ నుంచి ఊపందుకునే అవకాశం ఉంది. మే చివరి వారం, జూన్ మొదటి, రెండో వారంలో వేసిన పత్తి నుంచి దిగుబడి మొదలవుతుంది. తొలితీత పత్తిని రైతులు విక్రయిస్తారు. పత్తిలో తేమ అధికంగా ఉంటే నాణ్యత కోల్పోయి ధర దక్కదని రైతులు పంటతీత పూర్తిగానే విక్రయించేందుకు మొగ్గు చూపుతారు. అయితే, 8-12 శాతం తేమ కలిగిన పత్తిని ప్రభుత్వం నిర్ణయించిన ధరతో కొనుగోలు చేస్తుంది. ఎనిమిది శాతం తేమ కలిగిన పత్తి క్వింటాకు రూ.7,521 చెల్లిస్తూ.. తేమ శాతం పెరిగే కొద్దీ ధర కాస్త తగ్గుతుంది. అయితే, 12 శాతం వరకు తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌లో 20 శాతం వరకు తేమ కలిగిన కొత్త పత్తి విక్రయానికి వస్తుండగా రూ.7,500 వరకు ధర దక్కే అవకాశముంది.

పత్తి ధర పెరిగింది



ఇప్పుడు పత్తి ధర పెరిగింది. రెండున్నర ఎకరాల్లో పత్తిని సాగు చేశా. ప్రస్తుతం 5 బస్తాల దిగుబడి వచ్చింది. తేమ ఉండటంతో క్వింటాకు రూ. 7,011 ధర పెట్టారు. పాత పత్తికి రూ. 7,900 వరకు ధర పలుకుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లకు మించే పరిస్థితి లేదు.

– బాణోత్ లాలు, పంగిడి, రఘునాథపాలెం మండలం

డిమాండ్ పెరుగుతోంది



పత్తికి అనూహ్యంగా డిమాండ్ పెరుగుతోంది. పత్తి గింజలతో పాటు బేల్ ధరలు పెరగడంతో పంటకు డిమాండ్ వచ్చింది. పలు వస్తువులపై కేంద్రం దిగుమతి సుంకం పెంచడంతో పత్తికి ధర పెరుగుతోంది. జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా పత్తి ధర పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల కన్నా ప్రస్తుతం అధిక ధరలే నమోదవుతున్నాయి.

– మన్నెం కృష్ణ, ఖరీదుదారు, ఖమ్మం మార్కెట్

బొగ్గు గనుల్లో పండగే..

- సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాల వాటా
- సంస్థ చరిత్రలో తొలిసారి కాంట్రాక్ట్ కార్మికులకూ రూ. 5వేల బోనస్
- రూ.796 కోట్లు పంపిణీ చేయనున్న యాజమాన్యం
- ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు



భూగర్భ గనిలో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న లాభాల వాటాను ప్రభుత్వం ప్రకటించింది. 33 శాతం మేర కార్మికులకు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.37 వేల కోట్లు టర్నోవర్ చేయగా, రూ.4,701 కోట్ల లాభం ఆర్జించింది. ఇందులో కంపెనీకి వచ్చిన నికర లాభం రూ.2,888.20 కోట్లు. ఈ లాభంలో 33 శాతం అంటే రూ.788 కోట్లు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.8 కోట్లు కలిపి మొత్తంగా రూ.796 కోట్లు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో సుమారు 39 వేల మంది కార్మికులు వివిధ విభాగాల్లో పని చేస్తుండగా సగటున ఒక్కొక్కరికి రూ.1.90 లక్షల చొప్పున చెల్లించనుంది(వారి మస్టర్ల ప్రకారం కేటాయించిన మొత్తాన్ని లెక్కిస్తారు). గతేడాది సగటున ఒక్కో కార్మికుడికి లాభాల వాటా రూ. 1.70 లక్షలు చెల్లించగా ఈ సంవత్సరం రూ.20 వేలు అధికంగా రానున్నాయి. అక్టోబర్ 5, 6 తేదీల్లో కార్మికులకు నగదు అందనుంది.

గత పదేళ్లుగా సంస్థకు వచ్చిన లాభం, కార్మికుల వాటా ఇలా..

ఆర్థిక సంవత్సరం	సాధించిన లాభం (రూ.కోట్లలో)	చెల్లించిన వాటా (రూ.కోట్లలో)
2012 - 13	400	71.63
2013 - 14	418	83.06
2014 - 15	490	103
2015 - 16	1066	245
2016 - 17	395	99
2017 - 18	1,212	327
2018 - 19	1765	494
2019 - 20	993	278
2020 - 21	272.64	79.07
2021 - 22	1227	368
2022 - 23	2,222	700
2023 - 24	2888.20	778 (చెల్లించాల్సి ఉంది)

134 సంవత్సరాల్లో తొలిసారి..

సింగరేణి సంస్థలో సుమారు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరు గత కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. అయితే ఈ ఏడాది తొలిసారిగా వారికి కూడా రూ.5వేల చొప్పున లాభాల బోనస్ ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది.

వరద బాధితులకు రూ.10.25 కోట్లు..

ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలోని పలు జిల్లాల రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో బాధితులకు సింగరేణి కార్మికుల ఒకరోజు వేతనం చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఈ క్రమంలో కొన్ని కార్మిక సంఘాలు కార్మికుల జీతం నుంచి కాకుండా లాభాల నుంచే వరద బాధితులకు కూడా ఇవ్వాలని కోరగా స్పందించిన యాజమాన్యం కంపెనీకి వచ్చిన నికర లాభం నుంచే రూ. 10.25 కోట్లు చెల్లిచేందుకు అంగీకరించింది.

కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీ నిలుపుకున్నాం



గతేడాది గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా ఇప్పిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడా మాట నిలుపుకున్నాం. వారికి వచ్చే మొత్తం తక్కువే అయినా ఎంతో కొంత సాధించాం. సింగరేణి చరిత్రలో కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వడం ఇదే తొలిసారి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ నేత